ఆంధ్రప్రపంచ వాతావరణమునందు సారస్వత, మత, సాంఘిక, రాజకీయ జీవితమున నొక యనూనశోభ ఘటించి నూతన యుగారంభప్రదోషకాంతు లెల్లెడలం బర్వుచున్నవి.

విద్యార్థులును అన్యులవలెకాలరథమును నడుపుచున్నారనుట నిర్వివాదాంశము. అట్టియెడ నాంధ్రవిద్యార్థులు జాతీయసమస్యల నేదృష్టితో చూచుచున్నదియు తెలియుటకును, ప్రస్తుతాభినివేశము చక్కని విధమున వినియోగపడుట కవకాశమొదవుటకును, ప్రస్తుతమధఃపతనము నొందియున్న జాతీయాదర్శము లుద్ధరింపఁబడి పునరుజ్జీవితము లగుటకును గల సాధనములలో పత్త్రికాప్రచురణ మొకటి యనిన విచిత్రమేమియు నుండదు. ఇదియును గాక యాంధ్రసారస్వతమునఁ బొడసూపి దినదినాభివృద్ధి గాంచుచున్న క్రొత్తపోకడల విమర్శించుటయును, ప్రస్తుతాంధ్రగణనీయ కావ్యములఁ గొన్నింటిని పాశ్చాత్త్య విమర్శనా సూత్రసమన్వయమున నాదరించుటయును మా యాశయములు. మరియును ఆంధ్రవిశ్వవిద్యాలయ శిక్షావిధానమునఁ దెనుగునకుఁ బ్రాముఖ్యము అధికము కానున్నది. సమస్త విజ్ఞానశాస్త్రములును దేశభాషయం దభ్యసింపవలసియే యుండును; గనుకఁ దచ్ఛాస్త్ర గ్రంథసామగ్రి తెనుఁగునఁ జేకూర్చుటకుఁ బ్రయత్నములు సేయఁబడుచున్నవి. ఇట్టి యత్నముల ప్రోత్సహించుటయు మా పత్త్రిక విధి.

ఇదియుఁ గాక యాంధ్రవిద్యార్థివ్యక్తిత్వసంస్థాపనము గడుంగడు నవసరము: వారిభావములు, అభిప్రాయములు, వారివ్యథలు, వేయేల! యాంధ్రవిద్యార్థి భావ్యభ్యుదయసిద్ధియే యీ యుద్యమమునకు జీవనము. భావి జీవితము ప్రకృతముపై నాధారపడియుండ బ్రస్తుతపుటాంధ్రవిద్యార్థులకు అత్యుత్కృష్టపౌర జీవితాశయముల బోధించుటయు మాకర్తవ్యము కావున నాంధ్రశ్రీకలితులు, పండిత ప్రకాండులు, విద్యార్థులు ఏతదాశయపరిపూర్ణానుభూతికై మాకుఁ దోడ్పడుదురు గాక యని నమ్ముచున్నాము.

ఫలశ్రుతి

౧

అంత శ్రమపడి పావన మభ్రగంగ
    ధారుణికి తెచ్చినాడు భగీరథుండు !

అంత మథియించి కలశరత్నాకరమ్ము
నమృతభాండమ్ము పడసినా రమరవరులు !

మత్పురానేక పుణ్యజన్మములు పండి
జాహ్నవీ స్వచ్ఛవును సుధా స్వాదుమూర్తి
వైన నీ దివ్యసాన్నిధ్య మంటుఁకొంటి
పుడమికిన్ స్వర్గమున కొక్కముడి రచించి !

ఇంతకాలమ్ముగా నా కదృష్టములయి
యెన్ని ఆనందధామమ్ము లీ యనంత
భువనసంధుల భాసిల్లునవియు నేడు
మత్పదాక్రాంతములు భవన్మహిమ జేసి !

'సౌభదుఁడు'

ఆంధ్రదేశములోని బౌద్ధనిర్మాణావశేషములు

మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు

పూర్వకాలమున బౌద్ధమతము ఆంధ్రదేశమునఁ జక్కఁగ వర్ధిల్లెననుటకు అందు జీర్ణముకాఁగా ఇంకను శిథిలములై నిలిచియున్న బౌద్ధనిర్మాణావశేషములే తార్కాణములుగ నున్నవి. ఇట్టివి కృష్ణ, గుంటూరు, గోదావరిమండలములలోఁ జాల గానవచ్చును. అందు ముఖ్యముగ కృష్ణానదీతీరమే యిట్టి నిర్మాణములకు నెలవుగనున్నది. ఇందులకుఁ గారణ మిది. ముఖ్యముగ నిప్పటి కృష్ణా, గోదావరీ మండలముల నాక్రమించి తుదకుఁ దమ జాతిపేరిటనే యాప్రాంతమున కాంధ్రదేశమని పేరొసంగి యశఃకాయులై వర్ధిల్లినయాంధ్రులను కృష్ణానదీతీరమున వారికి నున్న ధాన్యకటకనగరము రాజధానిగ నుండెను. ఆంధ్రరాజపుంగవులు బౌద్ధమతము నాదరించి, బౌద్ధకళలను బ్రోత్సహించినవారగుటచేత వారి రాజధానియున్న కృష్ణానదీతీరప్రాంతమున బౌద్ధనిర్మాణములు కాన్పించుటలో వింతలేదు.

ఈప్రాంతముల నివి యిప్పటి కృష్ణా, గుంటూరుమండలములలోని అమరావతి, భట్టిప్రోలు, గుడివాడ, గరికపాడు, జగ్గయ్యపేట, పెద్దమద్దూరు, పెద్దగంజాం, ఘంటశాల, అనంతవరము, బుద్ధాని, చందవోలు, చండూరు, కొండముడి, మండూరు, మోరకూరు, మూల్పూరు, పెరవలి, పినపాడు గ్రామములలో ముఖ్యముగఁ గానవచ్చుచున్నవి గోదావరి మండలములోని కొడవలు, తిమ్మవరము(పిఠాపురము జమీందారీలోనిది) గ్రామములలోను, విశాఖపట్టణమండలమునందలి శంకారము గ్రామములోనుగూడ నిట్టి నిర్మాణావశేషములు కలవు.

స్తూపము

ఈ పైనుడివిన ప్రదేశము లన్నిటిలోను ముఖ్యముగఁ గానవచ్చినది స్తూపము. స్తూపమనఁగా మంటిదిబ్బ. కాని నేఁడు స్తూపమను పేరు ఒక ప్రత్యేక బౌద్ధనిర్మాణమునకు రూఢముగ వాడుచున్నారు. బుద్ధుఁడు నిర్వాణము నొందినపిదప నాతనిశిష్యులు ఆతని యస్థికలనో, దంతములనో, లేక యాతనికి సంబంధించిన మఱి యే యితరవస్తువులనో గొనిపోయి యొక చక్కని కరండము(Casket)న నుంచి దానిపై నిటుకతోనో, ఱాతితోనో యొక కట్టడమును నిర్మించి యారాధించువారు. క్రమముగా నొక్కబుద్ధునికి సంబంధించినవస్తువులను మాత్రమేగాక సుప్రసిద్ధులైన యర్హంతులయొక్క యవశేషములను, వస్తువులనుకూడఁ గొనిపోయి, పుణ్యయశోభవృద్ధి నిమిత్తమట్టికట్టడములను గట్టుట బౌద్ధయుగమున నొక యాచారమయ్యెను. సాధారణముగ నిట్టి

నిర్మాణములకు గర్భమునఁగల కరండముపై నిప్పటి "డోము"వంటి శిఖరముతోనున్న యొకకట్టడమును, దానికి చుట్టు ఱాతితోనో, లేక కఱ్ఱతోనో చేయఁబడిన యొక 'కటకటాల' ప్రాకారము నుండును. ఇట్టి బౌద్ధనిర్మాణమునకే యిప్పుడు స్తూపమనుపేరు రూఢముగ నున్నది. బౌద్ధయుగమునాఁటి శిల్పకళ యీ స్తూప నిర్మాణముతోనే ప్రారంభమగుచున్నది.

బౌద్ధయుగమున నీవిధమైన నిర్మాణమే వాడుకలోనికివచ్చి పూజ్యార్హమయ్యెను. ఇట్టి నిర్మాణము క్రీస్తుపుట్టుటకుపూర్వము అశోక చక్రవర్తికాలమునఁ బ్రారంభమై, అందచందముల నెఱింగిన ప్రతిభాశాలులైన కళాకుశలులచేతులలోఁ గ్రమవికాసమును బొంది తుదకు ఆంధ్రరాజుల కాలమునాఁటికిఁ జాలనభివృద్ధిలోనికి వచ్చెను.

బౌద్ధయుగమున నిట్టి నిర్మాణములందే పూజాతత్పరులైన యాంధ్రశిల్పుల ప్రతిభాసంపద పరిపూర్ణముగ వ్యక్తమయ్యెను. ఒక్కొక్కయంతర్భాగమును, అట్టి పెక్కుఅంతర్భాగములతోఁగూడినయొక్కొక్క నిర్మాణమును మాతృమూర్తియైన భారతీదేవి నుపాసించిన సాధకులకు పూజాకుసుమము లయ్యెను. బౌద్ధయుగమున నిట్టి స్తూపరాజములే సిద్ధహస్తులైన యాంధ్రశిల్పుల కావ్యరచనలకు ప్రదర్శనశాలలై తనర్చెను.

ఈవిధమున బౌద్ధయుగమే హిందూదేశములోని సకలకళలు పంటపండినకాలము. అప్పుడే యుత్తరహిందూస్థానమునందలి నాలంద, తక్షశిల మొదలగు గొప్ప విశ్వవిద్యాలయములును, దక్షిణాపథమున ధాన్యకటకము మొదలగు గొప్ప విద్యాపీఠములును వర్ధిల్లినవి. అఁకలిఁగొని విదేశములనుండి వచ్చిన విజాతీయవిద్యార్థులకు భారతవర్షము గొప్పవిద్యాసంతర్పణములను గావించి దీవించి పంపిన దీకాలముననే.

కాని యుత్తరహిందూస్థానమునందువలె మనయాంధ్రదేశమున బౌద్ధయుగమున గొప్ప విద్యాపీఠములు వర్ధిల్లినట్లు ఇంతవఱకు దొరకిన యాధారముల ననుసరించిచూడ కాన్పింపదు. ఇట్లనుటచేత గొప్ప విద్యాపీఠములు లేవని, ధాన్యకటకము అట్టి విద్యాపీఠములలో నొకటికాదని కాదు. కాని ముఖ్యముగ బౌద్ధాంధ్రులు భారతీదేవిని శిల్పకళద్వారమున నారాధించిరని విశ్వసింపవలసియున్నది. ఆకాలమునఁ దెలుఁగునాఁటఁ గళలే గొప్ప యభివృద్ధిలోనికి వచ్చియుండెననుట కీనిర్మాణములే యాధారములు. ఈ విధమైన కళాభివృద్ధి కెక్కువగఁ దోడ్పడినవారు ఆంధ్రప్రభుపుంగవులైన గౌతమీపుత్ర శాతకర్ణి, వాసిష్ఠీపుత్ర శాతకర్ణి మొదలగు చక్రవర్తులే. వారు అత్యంతము కళాభినిరతులై శిల్ప, చిత్రలేఖనాదివిద్యలను గౌరవించి పోషించియున్నారు. బౌద్ధయుగము నాఁటి యాంధ్రశిల్పకళ కుత్తమోదాహరణము లాంధ్రదేశముననే కానవచ్చుచుండ, ఆంధ్రచిత్రలేఖకుల చతురతూలికావిన్యాసములకు అజంతావిహారములు రంగస్థలములై యొప్పారుచున్నవి.

చిత్రకళ

జగ్గయ్యపేటస్తూపమునందలి స్త్రీ విగ్రహముల దుస్తులు, అలంకారములు మొదలగునవి, అజంతాగుహలలో నొకానొకగుహ యందుఁ జిత్రింపఁబడిన స్త్రీవిగ్రహముల యలంకారాదులు మొదలగునవి యొక్క రీతిగ నుండుటచేత నీ యుభయకళలయందలి స్త్రీలును ఒకేతెగకు,ఒకేజాతికి చెందినవారనియు, అజంతాచిత్తరువులందలిచిత్రములు ఆంధ్రపూజాతత్పరుల యిటీవలి యాకృతులనియు బర్గెస్ గారు నుడువుచున్నారు. ఇంతియేకాదు: అజంతాచైత్యము పదవనెంబరుగుహ జగ్గయ్యపేటస్తూప మంత పురాతనమైనదనియు, దాని లోని చిత్తరువులతీరుల ననుసరించి యొకవిధముగ దానికాలము నిర్ణయింపవచ్చుననియు, అది క్రీస్తుశకారంభకాలమునాఁటి దనియు బర్గెస్‌గారి వాదము.

అజంతాలోని ౯, ౧౦ నెంబరుగుహల లోని చిత్రములు చాల పురాతనకాలమునాఁటివనియు, ఆ చిత్తరువులలో మానవవిగ్రహములు ధరించినదుస్తులు మొదలగునవి ఆంధ్రరాజులైన శాతకర్ణుల కాలమునాఁటివే కాని అంతకుఁ దరువాతికాలపునికావనియు, అందు ముఖ్యముగ గౌతమీపుత్ర, వాసిష్ఠీపుత్రుల కాలమునాఁటివనియు, పదవసంఖ్యగలగుహను వాసిష్ఠీపుత్రపులుమావినే త్రవ్వించియుండవచ్చుననియు డాక్టరు ఫెర్గ్యుసన్ దొరగా రభిప్రాయపడుచున్నారు.

ఈ పై విషయముల ననుసరించి యాంధ్రరాజుల యాదరణమున శిల్పకళ ఆంధ్రదేశములోని స్తూపనిర్మాణములో నభివృద్ధినందుచుండ, చిత్రకళ అజంతావిహారములలోని చిత్తరువులలో 'తీరుతీయము' లందుచుండెనని నిశ్చయింపవచ్చును.

అమరావతి, జగ్గయ్యపేట స్తూపములు

ఆంధ్రదేశమునందలి బౌద్ధస్తూపనిర్మాణములలో మిక్కిలి ముఖ్యమైనవి అమరావతీ, జగ్గయ్యపేటలలోనివి. శిల్పకళాకోవిదుల కౌశలమునకును, విన్యాసమునకును ఇవి జగత్ప్రసిద్ధిని బడసియున్నవి. వీటిలో వెలుపలనుండు ప్రాకారపు ఱాళ్లమీఁదను, కట్టులమీఁదను, తోరణము లనఁబడు ద్వారములమీఁదను, 'డోము' ఆకృతిగల స్తూపనిర్మాణముమీఁదను, బౌద్ధమతగాథ లనేకము చిత్రింపఁబడియున్నవి. వాటిలో ముఖ్యమైనవి బుద్ధుని పూర్వజన్మవృత్తాంతములను దెలుపు జాతకకథలు. హిందూదేవాలయములమీఁద రామాయణ భాగవతగాథలు చిత్రించునట్లే ఈ స్తూపముల మీఁదఁ జిత్రించిన బౌద్ధమతగాథలను బరికించుచో నాఁడు బౌద్ధమత మెంత జనాదరణపాత్రమైన మతముగనుండెనో, జనసామాన్యమునకు మతాభిప్రాయములను దెలియఁజేయుటలోను, బౌద్ధమతమును వ్యాపింపఁజేయుటలోను, ఈ ప్రతిమాశిల్పము ఎంతపనిచేసెనో తేటతెల్లము కాఁగలదు. చలువఱాలమీఁదఁ జిత్రితమైయున్న యా ప్రతిమాశిల్పమును సూక్ష్మముగఁ బరికించినచో చతురులైన బౌద్ధయుగమునాఁటి ఆంధ్రశిల్పులచేతిలో నాచలువఱాయి తన కాఠిన్యమంతయు వీడి వారికి లొంగిపోయి మెత్తని మైనపుముద్దగ

మారిపోయినట్లు కన్పట్టును. అట్టిది ఆయలంకారపుఁబనులయొక్కయు, 'నగిషీ'పనులయొక్కయు వైచిత్ర్యము. దానంజేసియే జగ్గయ్యపేట అమరావతి మొదలగుస్తూపరాజములు ఒక్కయాంధ్రదేశమునకేకాక శిల్పకళాప్రపంచమునకంతకు నలంకారప్రాయములై యున్నవి. అందు అమరావతి వాటిలోనికెల్ల మకుటాయమానమై యలరారుచున్నది.

కొంతకాలమువఱకు అమరావతీస్తూపమునందలి శిల్పకళ ఒక్క ఆస్తూపమునందే పరిపూర్ణత నందెనని చాలమంది తలంచుచుండువారు; కాని యితరస్థలములందలి స్తూపములు కూడ బయలుపడిన పిదప దక్షిణాపథమున బౌద్ధయుగమునాఁటి శిల్పాచార్యులందఱును సిద్ధహస్తులేయనియు, ఆనాఁడు శిల్పకళ చాల పరిపూర్ణత నందెననియు కళావిదులెల్లరు సిద్ధాంతీకరించియున్నారు.

అదియటుండ ఱాతితోఁ గట్టడములు కట్టుట హిందూదేశమున బౌద్ధులతోనే ప్రారంభమయ్యెననియు, విగ్రహములను మలచుటలోఁగూడ బౌద్ధులు సిద్ధహస్తులనియు, జీవకళ యుట్టిపడునట్లుండు ఆనాఁటి గ్రీకువిగ్రహములకంటె వారుచిత్రించిన ప్రతిమలు మిన్నగ నెన్నఁదగియుండెననియు రీ దొరగారభిప్రాయపడుచున్నారు.

కాలము

ఈస్తూపము లేకాలపువి?

ద్రాక్షారమము, సింహాచలము మొదలగుదివ్యస్థలములయందలి యాలయముల మీఁదనలెనే ఈస్తూపముల ఱాలమీఁదను, శిఖరముల మీఁదను గొన్నికొన్ని శాసనములు కానవచ్చుచున్నవి. ఆ శాసనముల ననుసరించి స్తూపములకాలమును నిర్ణయింపవచ్చును. అట్టి శాసనములలో నొకటి అమరావతీ స్తూపమునకు వెలుపలిప్రాకారపుఱాళ్లమీఁదఁ గలదు. అది ఆంధ్రరాజయిన వాసిష్ఠీపుత్ర (శ్రీ)పులుమావిది. ధాన్యకటకనగరము రాజధానిగ నీ తెలుఁగు దొర క్రీస్తుశకము ౧౩౮-౧౭౩ ప్రాంతమున బరిపాలనము నెఱపినవాఁడు. అందువలన నీస్తూప మప్పటికే నిర్మింపఁబడినట్లు నిస్సంశయముగ నిశ్చయింపనచ్చును. వెలుపలి ప్రాకారములకంటె లోపలిస్తూపము అంతకుపూర్వమే నిర్మింపఁబడియుండునని చెప్పఁబనిలేదు. భట్టిప్రోలుస్తూపములమీఁది శాసనములలోని లిపి ననుసరించి యవి క్రీస్తుశకమునకుఁ బూర్వము ౨౦౦ ల సంవత్సరములనాఁటివో లేక ఇంకను కొద్దిగ అంతకుఁబూర్వపువోయైయుండును కాని అంతకుఁ దరువాతివికావని బూలరు పండితులు నిశ్చయించుచున్నారు. ఈకారణములవలననే ఆంధ్రశిల్పకళకుఁ బ్రోత్సాహ మిచ్చినది ఆంధ్రరాజులనియు, అందు ముఖ్యముగ గౌతమీపుత్ర, వాసిష్ఠీపుత్రులనియు నుడువుట కవకాశము కలిగినది.

అమరావతి, జగ్గయ్యపేట స్తూపముల తరువాత ఘంటశాల, గుడివాడ, భట్టిప్రోలు స్తూపములు ముఖ్యమైనవి. వీటితరువాత శంకారము బౌద్ధస్తూపముకూడఁ బేర్కొనందగినది.

ఆంధ్రదేశమునందలి యీ బౌద్ధయుగ నిర్మాణములను బరీక్షించి రీ దొరగా రిట్లు వ్రాయుచున్నారు.

"హిందూదేశమున బౌద్ధయుగానంతరము నిర్మింపబడిన నిర్మాణములలో బౌద్ధుల శిల్పకళానిర్మాణములను మించిన వేవియు లేవు. తరువాత వర్ధిల్లిన ద్రావిడశిల్పకళవలె గాక, బౌద్ధుల నిర్మాణములలోని వేలువేలు స్వల్పవిభాగములుకూడ దివ్యతమములుగ నుండుట యటుండ, తన్నిర్మాణములే సంపూర్తిగ శిల్పకళారచన కుత్తమోత్తమోదాహరణములుగ నున్నవి."

కళ-క్షీణదశ

ఆంధ్రదేశములోని యుత్తమజాతి శిల్పకళకు గొప్ప యుదాహరణములుగ నున్న యీ స్తూపములు రానురాను కళానభిజ్ఞుల చేతులలోఁ బడి రూపుమాసిపోయినవి. అందు ముఖ్యముగ మహమ్మదీయుల కాలము నుండియు దేశమున కళాభిరుచి మందగించెను. నాఁడుమొదలు దేశమున కళాదారిద్ర్యము సంభవించెను. అత్యంతము మతాభినివేశ పరవశులైనవారు కొందఱు పెక్కు మతసంబంధములైన నిర్మాణములకు రూపురేఖలుమార్చివేసిరి. హిందూపరిపాలనము పిదప దేశముకూడ మహాసంక్షోభమును జెందెను. వర్తకవ్యాపారముచేసి లాభము గడింపవలె ననుతలంపుతో విదేశీయులు హిందూదేశమున నడుగిడి, రాజ్యలాభాకాంక్షతో నొండొరులతోఁ బోరాడికొను దేశీయప్రభువులకుఁ దోడుపడి దేశమును రక్తప్రవాహముతో మఱింత పంకిలముఁ గావించిరి. భోగలాలసత్వమునను, యుద్ధములందును తగులుకొని దేశీయప్రభువులు కళావిశారదుల నాదరించుట మానుకొనిరి. ఆదరించి భరించువాఁడును, రక్షించి ప్రోత్సహించువాఁడును లేక లలితకళావిజ్ఞానము దేశమున సన్నగిల్లినది. మాధుర్యమును జవిచూడఁగల రసనయు, సౌందర్యమును వీక్షింపఁగలదృష్టియు, రసపరిప్లుతమైన సంగీతమును వినఁగలశక్తియు దేశీయులలో శుష్కించిపోయెను.

ఎప్పటినుండి దేశీయుఁడు శిల్పకళలోని చాతుర్యమును, చిత్రకళలోని సౌందర్యమును గనఁజాలని యంధుఁడయ్యెనో, ఏనాఁటినుండి కళానైపుణ్యమునకు ప్రభుపుంగవుల యాస్థానముఁ బ్రోత్సాహము కొఱవడియెనో నాఁటినుండియే మనభారతజాతియొక్క యధఃపతనమారంభమయ్యెను. దేశచారిత్రమున కిట్టి చీఁకటిరోజులు సంభవించినకాలముననే ఆంధ్రదేశములోని బౌద్ధాదినిర్మాణములును కొన్ని వినాశనదేవతపాలఁ బడినవి.

క్రమక్రమముగ దేశీయప్రభువులైననేమి, ప్రజలైననేమి ఇండ్లు కట్టుకొనుటకో, మఱి యితరకార్యములకో యీకట్టడములను బెకలించి, వాటిలోనుండి తమకుఁ గావలసిన యిటుకను, ఱాళ్లను గొనిపోయిరి. క్రీస్తుశకము పదునెనిమిది, పందొమ్మిదిశతాబ్దములలో ఈ నిర్మాణములలోని శిల్పకళాసంపద నెఱుంగనిగొర్నమెంటు ఉద్యోగులుకూడ కొన్ని

కొన్ని కట్టడములను బౌడుచేసి, తమనిర్మాణముల కందలి సాధనసామగ్రి నుపయోగించుకొనిరి. ఈవిధమున బౌద్ధయుగమునాఁటి కొన్నికొన్ని నిర్మాణములు పాడయిపోయినవి. మఱికొన్ని భూగర్భమునఁబడిపూడిపోయినవి.

త్రవ్వుపని

క్రిందటిశతాబ్దమున కళాభిజ్ఞులైన దొరలు కొందఱు అచ్చటచ్చట చెల్లాచెదరుగ పడియుండిన యాకట్టడములలోని శిలాఫలకములను, వాటిమీఁది శిల్పసంపదను గాంచి యచ్చెరువంది, యేతద్విషయము నాంగ్లపత్రికల ద్వారమున లోకమునకుఁ జాటినపిదప విదేశీయకళాభిజ్ఞులయొక్కయు, కళాభిమానులయొక్కయు, ప్రభుత్వమువారియొక్కయు దృష్టి వాటిపైకి మఱలెను. అప్పటినుండి ప్రభుత్వమువారు కొన్నిదిబ్బలను త్రవ్వించియున్నారు. మొట్టమొదట పేర్కొనంబడిన ఆంధ్రదేశములోని స్తూపములన్నియు నట్లు త్రవ్వింపఁగా బయలుపడినవియే. బౌద్ధయుగమునాఁటి ఆంధ్రశిల్పుల కళాకౌశలము ఈ యమరావతి మొదలగు స్తూపములు బయలుపడిన తరువాతనే వెల్లడియై కళాభిజ్ఞులను అద్భుతాశ్చర్యములలో ముంచివేసినది.

విశాఖపట్టణమండలము లోని శంకారము గ్రామమునందలి దిబ్బత్రవ్వుచుండఁగా నందుండి బౌద్ధచైత్య మొకటి బయలుపడెను. చైత్యమును జుట్టియుండు క్రిందిభాగము త్రవ్వఁగా అందుపెక్కుగదులు కానవచ్చెను. ఆగదులలోనిగోడలకు గూళ్లుకలవు- అవి దీపములు పెట్టునట్టియు, విగ్రహములుంచునట్టియు గూళ్లు. ఆగదులలో నొకదానిలో వేంగీచాళుక్యరాజయిన మొదటివిష్ణువర్ధనుని నాణెములు చాల దొరకినవి. ఈ విష్ణువర్ధనుఁడు వేంగిలో చాళుక్యరాజ్యమును స్థాపించి, వేంగీచాళుక్యులకు మూలపురుషుఁడైనవాఁడు. ఈతఁడు పిఠాపురమురాజధానిగ కళింగములోని కొంత భాగమునుగూడ క్రీస్తుశకము ౬౧౫. ౬౩౩ వఱకుఁ బరిపాలించెను. చాల యరుదైన ఈ విష్ణువర్ధనుని నాణెములన్నియు రాగివి; సీసపువి. నాణెములుమాత్రమేగాక మంటిపాత్రలు మొదలగునవికూడ దొరకెను.

పై నుడివిన రాగినాణెములలో నొక బంగారునాణెముకూడఁ గనఁబడినది. డాక్టరు బ్లాక్ అను ఆయనయు, కీ. శే. రావుబహద్దరు వెంకయ్యగారును ఆ నాణెమును బరిశోధించి యది సముద్రగుప్తుని దని సిద్ధాంతీకరించియున్నారు. ఈ గుప్తచక్రవర్తి క్రీస్తుశకము నాలుగవశతాబ్దము మొదటిభాగమున నున్నవాఁడు. దీని ననుసరించి చూడఁగా సముద్రగుప్తునినాఁటికే యా బౌద్ధచైత్యము నిర్మింపఁబడియుండెనని స్పష్టమగుచున్నది.

బౌద్ధయుగానంతర మా చైత్యము హిందూదేవాలయముగ మాఱిపోయెను. అందు లింగము, పానవట్టమును జేరుట తటస్థించెను *

రేపల్లెతాలూకాలో బుద్ధాని మొదలగు గ్రామములలో పాడువడిన దిబ్బలు చాల

* స్తూపముయొక్క యాకృతి కొంచె మించుమించు లింగాకృతిని బోలియుండుటచేత బౌద్ధ, శైవమతములురెంటికిఁ గొంతసంబంధమున్నట్లు తోఁచును.

గలవు. బుద్ధానిలోని పూర్వపు పాటిదిబ్బలు త్రవ్వించినపుడు అందు రాగివి బౌద్ధవిగ్రహములు దొరకెను. దానితోపాటు అచట బౌద్ధయుగమునాఁటి చలువఱాతి స్తంభముకూడఁ గాన్పించెను. ఇట్లే ఆతాలూకాలోని పాటిదిబ్బలు త్రవ్వించినపుడెల్ల అందుండి కుండపెంకులో, మంటిపాత్రలో, ఱాతిపలకలో, నగలో, నాణెములో, బౌద్ధవిగ్రహములో యేవియో కొన్ని పురాతనవస్తువులు బైటపడుచునేయుండును. చందవోలులో చాలకాలముక్రితము కాలువత్రవ్వినప్పుడు అచ్చటఁ గొంతులోతున పెద్ద నిక్షేపము దొరకెనఁట. అందలి బంగారుముద్దలు ఆకారపరిమాణములలో ఇటుకలవలె నుండెనఁట. అవి యిత్తడివనుకొని ఆ నిక్షేపమును గనుఁగొన్నవారు వాటిని ఇత్తడిపలకలను భ్రమతోనే బజారులో అమ్మివేసిరఁట. ఆగ్రామమున నప్పుడప్పుడు బంగారునాణెములు కూడఁ గనఁబడుట కలదు. ఇట్లే గుడివాడ, ఘంటశాల, అమరావతి మొదలగుచోట్లను నాణెము లప్పుడప్పుడు దొరకుచుండును. ఇప్పటికిని అమరావతీస్తూపమును సందర్శించువా రచటినుండి ఆంధ్రరాజుల సీసపు, రాగినాణెములను వెదకి యేరి తీసికొనివచ్చుచుందురు.

క్రొత్త స్తూపములు

కృష్ణా మండలములోనినందిగామ తాలూకా అల్లూరులో సంవత్సరము క్రిందట శ్రీ జయంతిపురంరాజావారికి బ్రాహ్మీలిపిలోని శాసన మొకటి కనఁబడినది. క్రీస్తుశకారంభమున దక్షిణ హిందూదేశమునఁ గాన్పించు శాసనములన్నియు బ్రాహ్మీలిపిలోనేయుండును. వాటిలోఁ జాలవఱకు బౌద్ధభిక్షువులకు విహారములకుఁ జేయఁబడినధర్మములను దెలుపుచుండును. అందువలన నాప్రాంతమున బౌద్ధవిహార మొకటి యుండియుండుననియు, అందువలన దానిని త్రవ్వింపవలెననియువా రూహించుచున్నారు. ఇట్లే మధిరరైలుస్టేషనుకు ఆఱుమైళ్లదూరమునను రామిరెడ్డిపల్లి గుట్టమీఁద నొక స్తూపమున్నట్లు శాసనశాఖవారుకనుఁగొనిరి. దానినిగూడ వారు త్రవ్వింపవలెనని యున్నారు. ఇట్టివాటిని త్రవ్వించుటకు, త్రవ్వింపఁగా బయలుపడినవాటిని, ఇతర ప్రాచీన నిర్మాణములనురక్షించుటకు గవర్నమెంటువా రొకశాఖ నేర్పఱచియున్నారు. దానినే 'ఆర్కియలాజికల్ డిపార్టుమెంటు' అందురు. గవర్నమెంటువారు ధనము సప్లయిచేసినచో వాటిని త్రవ్వించుపని ఈశాఖవారిదే.

కొంతకాలముక్రిందట నేను నవాబుపాలెము అనుగ్రామమునకు వెళ్లినప్పుడు అచ్చటికి సమీపముననున్న ఆరుగొల్లు గ్రామములో నిట్టదిబ్బలు చూచుట తటస్థించెను. వాటిని జూచుటతోనే నాకవి బౌద్ధస్తూపములుగ నుండవలెనని తోఁచెను. ఆ దిబ్బల నచ్చట లంజదిబ్బ లందురు: ఒకటి పెదలంజదిబ్బ, రెండవది చినలంజదిబ్బ.

కృష్ణా, గుంటూరుమండలములలో నీ బౌద్ధనిర్మాణము లుండుస్తూపములను 'లంజదిబ్బ' లందురు. ఘంటశాల, జగ్గయ్యపేట, గుడివాడ-ఈ మొదలగు స్థలములందలి స్తూపములకన్నిటికి లంజదిబ్బలనియే పేరు. సాధా

రణముగ పైనుడివిన మండలములలో నెచ్చట 'లంజదిబ్బ' లను పేరుగల దిబ్బలు కాన్పించినను వాటిని మనము బౌద్ధస్తూపములుగనే పరిగణింపవచ్చును. బౌద్ధభిక్షువులయొక్క * నైతిక బలము చెడిపోయి, విహారములు మొదలగు బౌద్ధనిర్మాణములు తమ ప్రాచీనపవిత్రత గోలుపోయినయప్పటి బౌద్ధమతచరమదశలో వాటికి కళంకముకలిగి యట్టిపేరు కలుగుటకుఁ గారణము కావచ్చును. దాని ననుసరించియై యుండవచ్చును పూర్వము బౌద్ధవిహారములుగనో, చైత్యములుగనో, మందిరములుగనో యుండిన యీ దిబ్బలకు 'లంజదిబ్బ' లనుపేరు కలిగెను.

ఈ కారణముననే ఆరుగొల్లులోని లంజదిబ్బలుగూడ స్తూపము లని నేను విశ్వసించితిని. ఆరుగొలను క్రీస్తుశకము పదునొకండు, పండ్రెండుశతాబ్దములలో కొలనిపురపు తెలుఁగునాయకుల పరిపాలనమునఁ బ్రసిద్ధివహించిన కోటలలో నొకటి. ఇప్పు డిది నామమాత్రావశిష్టమై యున్నది. ఆరుగొల్లుగ్రామమున కనతిదూరముననున్న యెత్తైన కంకరగుట్టల పంక్తి వడువుననున్న పూర్వపుకోట ప్రాకారమును, దానిచుట్టు చాలపల్లముగానున్న కందకప్రదేశము నిప్పటికిఁ జూడనగును.

ఈ ప్రాకారమునకు ఒక్క అరమైలు దూరముననే చినలంజదిబ్బ కలదు. పెదలంజదిబ్బ దీనికి రమారమి మైలుదూరమున నున్నది. ఈ దిబ్బలమీఁద నా చుట్టుప్రక్కల నెచ్చటను గానరాని యిటుకలు మొదలగు భవననిర్మాణమున కనుకూలమగు సాధన సామగ్రి కానవచ్చును. ఈ నిదర్శనములను బట్టి యీ దిబ్బలు తప్పక బౌద్ధస్తూపములై యుండుననుటకు సందియము లేదని తలంచి గౌర్నమెంటు శాసనశాఖాధికారులకుఁ దెలిపితిని. వారును 'ఆర్కియలాజికల్ డిపార్టుమెంటు' వారికిఁ దెలిపినట్లు విందును. అనతికాలముననే వా రాదిబ్బలను త్రవ్వించి శోధింతురుగాక!

ఇంకను బౌద్ధయుగమును జ్ఞాపకమునకుఁ దెచ్చు నిట్టి నిర్మాణములు భూగర్భమున పూడిపోయియో, లేక శిథిలములయియో ఆంధ్రదేశమునఁ బెక్కు లుండవచ్చును. ఆంధ్రదేశమున, నందు ముఖ్యముగా నుత్తర సర్కారులలోఁ బెక్కుగ్రామములలో నిట్టి పాటిదిబ్బలు కలవు. వాటిలోఁ గొన్నియైన బౌద్ధనిర్మాణములు కావచ్చును. ఈ విషయమునం దభిమానము గలవారును, గౌర్నమెంటు 'ఆర్కియలాజికల్ డిపార్టుమెంటు' వారునుగూడ ఆంధ్రదేశమును సమగ్రముగ సర్వేచేసి, స్తూపములుగ నుండవచ్చునని బలమైన కారణములమీఁద ననుమానముఁ గల పాటిదిబ్బలను త్రవ్వించినప్పుడే బౌద్ధయుగము నాఁటి ఆంధ్రశిల్పకళాచారిత్రము సమగ్రముగఁ దెలిసికొనుటకు అవకాశము కలుగును.

* ఈ బౌద్ధభిక్షువులయొక్క జీవితములు 'హీనయాన'మను బౌద్ధమతముయొక్క కడపటిదశలోఁ జాలకళంకాంకితములైనట్లు నాగార్జునాచార్యుఁడుచేసిన సంస్కరణమువలననే విశదమగుచున్నది. బౌద్ధమతమున 'మహాయాన'మనునొక విధమగు భక్తిమార్గమును వృద్ధిపఱచిన నాగార్జునాచార్యుల వారు బౌద్ధసంఘమునుండి, యపవిత్రజీవితమునుగడపు ఎనిమిదివేలమంది బౌద్ధభిక్షువులను దఱుమఁగొట్టెనట. దీని ననుసరించిచూడ నేను పైనిచేసిన యూహలోఁ గొంత సత్యముండవచ్చునని నానమ్మకము.

"కృష్ణశాస్త్రి ప్రవాసము"నుండి

(సాహితీసమితి)

ఎన్నియెన్ని నిశ్వాసము లెగసినవియొ,
ఈ బ్రతుకె రూపుమాసిపోయినదికాని
ఇంత విశ్వమ్ములో జాలినింతసీడ
యొదవగాలేద యొక్క నిట్టూర్పునకును!

కంటఁగురిసిన కార్చిచ్చుమంట యొళ్లఁ
గాలి నుసియై నశించె వాంఛాలవాలె,
ఏ రెలుంగుమురని యే యెడారిదాగ్ల
నింకెనో చుక్కతడిజాడయేని లేక!

కరుణపట్టున కీ బిచ్చగాని చేయి
చాచికొనినాఁడ మృత్యుఘోషమ్మె మఱచి;
వట్టిబయలున నొక మోడుచెట్టువోలె
నెత్తినది కర మెత్తినట్లే కృశించు.

కనులు రెండును బండిచక్రమ్ము లయ్యె
చనవు చూపున కెఱుక నవ్వునకు వెదకి;
ఎందులకొ వెఱ్ఱిమదివోలె నిపుడుతిరుగు
చూపులేలేక యజ్ఞాతశూన్యసీమ.

స్వాగతాశ్లేషమున విడఁజాలునెదల
వల్లఁ ద్రావితిమున్ను దోసిళ్లకొలఁది;
వలపుటాకలి స్రుక్కు నా బ్రతుకుమీఁద
ఇనుపపాదాల నిడి లోక మిపుడు నడుచు.

ఆశయమ్ములు, నానందలేశములు, న
లంతి యాసలు, జీవితమంత, నిట్లె
యేడ్చువై చితి; విరువారె యొకులేక
యేడ్పుసందడి నాలోననే చొరంగ.

వడవడ వడంకిపోదు జీవనఁపుఁ గొనల
నెన్నఁడేనాసకళ తలయెత్తెనేని;
ఉభయ సంధ్యాంచలముల నెదో వెలుంగు
కలుగ కలవరపోవు ఘూకమ్మువోలె.

మింట వెలుఁగు చుక్కఁగన్న మిణుఁగురన్న
నేను సహియింపలే నవ్వియురులు చెఱచు;
నాకుఁ బ్రాణమే మెఱుపులే లేకయున్న
భాద్రపదమాసమున నమావాస్యరాత్రి
రేయి కడుపునఁ జీఁకటిచాయవోలె,
తమసు బెడఁద దివాంధగీతము విధాన,
ఘూకరావాన వలవంత రేకరీతి,
నా విషాదంబులో దాఁగినాఁడ నేనె.

నేటి తెలుగు కవిత్వము

పురాణం సూరిశాస్త్రిగారు బి. ఏ.

ప్రపంచచరిత్రమును పారజూచినయెడల మానవవిజ్ఞానవైఖరులు, కావ్యశిల్పాదుల లక్షణములు, కాలము ననుసరించి నడుచునేకాని దేశమునంటి నడువవని తెలియుచున్నది. కాలమే, కాలస్వభావమే నానాదేశముల ధీమంతుల నొక్కరీతిగ నడిపించుచుండును. ఇంతవరకు అనాగరికమైయున్న జాతిలో యీనాడొక కవి వెలువడి కావ్యరచనా సమర్థుడైనచో నాతడు నవీనజగద్వందితకవిపుంగవులదారుల నంటి రచించునే కాని గతించిన, వీరపౌరాణిక ప్రబంధాలంకారికస్వభావాది కావ్యరీతుల వాఙ్మయచరిత్రావస్థల ననుభవించడు. ఇట్టి కావ్యసిద్ధి కాలపరిస్థితుల ననుసరించి జనించునే కాని యనుకరణాభిలాషచే కాదు. నవీనపరిస్థితులలో విప్పాందిన నవ్యాంధ్రకావ్యరీతులు, పాశ్చాత్యులు నూటయేబదియేండ్లలోను, వంగీయకవులొకటి రెండు పురుషాంతరములందును, పొందిన గుణరూపపరిణామమును, కడచిన పదియేండ్లలో పొందియున్నవి.

విశ్వమందలి నానాదేశములకవిశేఖరులు మహాకావ్యములను, విపులగాధలను, వ్రాయుట మాని, చిన్నికథలు, ఖండకావ్యములు, భావగీతములు, మున్నగు సారస్వతారంభముల నవలంబించియున్నారు. నవీనజీవపరిస్థితులలో నిక్కాలపు స్వార్థధర్మములలో మహాకావ్యకల్పనకు వలయు దీక్షాపరత్వము, రసోపాసనగాధాగౌరవము, లోకహితైకకాంక్షయు, సన్నగిల్లినవి. కవుల కోర్కెలు దీర్చి కావ్యసంతాన సత్ఫలప్రాప్తికై బహుదినము లుపేక్షింపగల రసికపోషకులు లేరు. నాట్యసంగీతకవిత్వములందు ఒకభావమునుగాని, రసమునుగాని, శైలినిగాని, పెంచి వికసింపజేసియందలి సర్వాంగసౌందర్య మవలోకించు ప్రేక్షకులు లేరు. శ్రోతలులేరు. చదువరులు లేరు. పోషకులు లేరు. అంతటి శ్రమచేయు కళావిధాతలు లేరు. చపలచిత్తులై భిన్నరుచు లారయు జనసామాన్య మాధునికకళాపోషకులై వెలయ, నవీన జీవన సందర్భములు, కావ్య పరిమాణముల నిర్ణయింప, మాస దైనిక పత్రికలే ప్రచురణసాధనములై యమరియుండ, నవ్యకావ్యములు చిన్నిచిత్రములై రసపాటవంబున, భావగాంభీర్యమున, గీతికామాధుర్యమున మెప్పించ యత్నించుచున్నవి. జగములో నేదేశమున నెవరికాలమున వ్రాయదొడగినను కావ్యమీరూపమునే చెందుచున్నది. ఇది కాలప్రవాహమహిమ. ఆంధ్రు లిద్దానిగుర్తించి వర్తించుచున్నారు.

ప్రపంచములోని నానాదేశములందు జాతీయభావ మంకురించి పెల్లుబ్బి జాతీయకళాస్వరూపముల నాదరించురీతు లేర్పడినవి. జనసామాన్యమందు వాడుకలోనున్న మాటలు

గీతములు రసవంతముగ దోచి వాని పల్లెటి యందమును, పలుకుతీపిని కవు లనుకరింప యత్నించుచున్నారు. ఈజాతీయతత్వమే మన ఆంధ్రులనుకూడ నావరించియున్నది. పూర్వ మొకప్రక్క నన్నయాదులు సంస్కృతకావ్య లక్షణములే పరిగణించి తెలుగుబాస నన్యపద ములతోడను కొత్తవృత్తములతోడను అలం కరింపుచుండ నాంధ్ర జానపదులు వేరొక ఫణి తిలో స్వకీయభాషామర్యాద లొప్ప సారస్వ తము పెంచుకొని భక్తిశృంగార వీర రసముల గురియించు ముద్దులొలికెడి పదములను, పాట లను బాడుచుండిరి. రాజమహేంద్ర పురోహి తుని కావ్యసంతతి ప్రభుపండితజనాంగీకృతమై లిఖితమై వన్నెచిన్నెల దాల్చుచుండ తెలుగు దేశపు ప్రాకృత సారస్వతము కర్ణాకర్ణికగ గాలిలో దేలుచు సంఘగౌరవములేక యంత రించుచుండెను. ఈనాటికి తెలుగు దేశపుప్రాకృత గీతములు సభాగౌరవ మొందుచున్నవి. నవీ నాంధ్ర కవులు ఖండకావ్యములందు తెలుగు పలుకుల తేటనిగ్గులను మెరయింప జూచు చున్నారు.

ప్రాచీనాంధ్ర మహాకవుల రచనలందు యెక్కడనో ఒకతావున సందర్భవశమున కృతి పతి నభినందించుపట్టున సమకాలిక చరిత్రాంశ ములు సాంఘికరాజకీయపరిస్థితులు పేర్కొన బడుచుండెను. ప్రస్తుతకవిత్వమందు అందులో మేము విమర్శింపబూనిన పత్రికా ప్రచరిత ఖండకావ్యములందు ముప్పాలు సమకాలిక సాంఘిక రాజకీయోద్యమములను దేశనాయ కులను, చరిత్రాంశములను వర్ణించునవై యు న్నవి. సామాన్యసమకాలిక జీవితాంశములు కావ్యవిషయమగునా లేదా అనుసంప్రశ్నము నేటి కావ్యలక్షణ నిరూపణమందు తర్కింప వలసియున్నది. ఈ విషయము మంగిపూడి వెంకటశర్మగారి రచనల నభినందించు పట్టున విస్తరించియున్నాము.

ఇదివరకు ప్రకృతిశాస్త్రములు సృష్టిలో ని యొక్కొక యంశమును, నిర్జీవయంత్రము లోని వివిధభాగములవలె విడదీసి శస్త్రవిభజ నముచేసి, స్థూలముగ పరీక్షించుచుండెను. ఇందుచే శాస్త్రములు వస్తుగుణనిరూపకములై యింద్రియజగత్తును మించక, ఉదారభావ సం జనన ప్రభావ మొప్పకుండెను. కావ్యములు జగదంతరంగమందలి భావ భరితాంశముల నెత్తికొని యుదారమగు కావ్య పరిభాషలో చిత్రించుచుండెను. శాస్త్రముల భాష నీరస గద్యముగను, కావ్యపరిభాష యుదార రస పూరిత చిత్రలక్షణములతోడను నిండి, విష యమందును, శైలియందును కావ్యశాస్త్ర ములకు విప్పగు భేద మగుపడుచుండెను.

ఈనాడు శాస్త్రములు వస్తులక్షణనిరూ పణమే ప్రధానాంశముగ నెంచక, విశాలప్ర పంచములోని నానావిషయముల రూపాంగ సామ్యతను, ధర్మైక్యతను ప్రకటించుచు జగ ద్వ్యాప్తము లయిన యీశ్వరవిలాస లీలల జిత్రించుకావ్యము లగుచున్నవి. “చేతనాచేత నము” లను, పదార్థవిభజనము నశించి, జగ మంతయు ప్రాణమయమై మనోమయమై యా స్వాదించున ట్లూహింపబడుచున్నది. ఇది

మానసవిజ్ఞానకోశముల యుగము. బెర్గిసన్, అరవింద ఘోషుల మానసవిజ్ఞానసోపానముల నంటి శాస్త్రకళాప్రపంచ మేర్పడుచున్నది. నేటి ప్రకృతిశాస్త్రములు భావోద్దీపకములై ప్రకృతియొక్క గుణరూపాంగనిర్మాణమందును, ఆశ్రితధర్మములందును, ఏకత్వమునుజాటి కావ్యలక్షణమును సమీపించుచున్నవి. ఇందుచే శాస్త్రపరిభాష, కావ్యసౌందర్య మొప్పు తెరవుల వికసించుచున్నది. ఈనాటి వివిధశాస్త్రములందు ఋషిప్రాయులగు మహనీయు లేర్పరచిన సంహితలు చదివిచూచిన, భ్రమర గీతము లెట్టి యానందమును గలిగించునో, గీతా వాక్యము లెట్టి యాధ్యాత్మికచింత నెలకొల్పునో, టర్నరు, వాట్సు, అవనీంద్రనాథుల చిత్రపటము లేయుదారభావముల నుద్దీపించునో, నిశాప్రశాంతశీతలవాతాహ్వతగీతికాస్రవంతు లెవ్విధ మగు రసావేశ పారవశ్యమును గలిగించునో, అట్టి సరసానుభవ యోగసమాధియే, శాస్త్రపరిశోధన లందించుచున్నవి. ఉత్తమ శాస్త్రపఠనము, కావ్యకళాపరిశోధనము ఒకేవిధ మగు జగత్తత్త్వానుభవము నిచ్చుచు లౌకికవ్యాసంగమునుండి బుద్ధిని మరలించి, పరతత్త్వరసానుభూతిలో, యోగ సమాధి గూర్చుచుండును. ఇది నా అనుభూతవిషయము. ఈనాటి కావ్యములు యేదో ఒకఅవస్థను, భావమును ప్రత్యేకముగ నుపలక్షించి, దానియందలి, యంగప్రత్యంగములను, సూక్ష్మముగ బరీక్షించుచు విమర్శనాత్మకములై వెలయుచున్నవి. నవీనభావగీతములు విపులమగు రూపకల్పన గావించక, యల్పాంశములందు స్ఫురించు రసభావవిలసనము విస్తరించుచు, భావపల్లవి పెంచుచున్నవి. శబ్దాలంకారములు ఛందోనియమములు, ఉత్ప్రేక్ష, అతిశయోక్తి, మున్నగు శబ్దార్థ చిత్రములు, నవీనాంధ్రకవిత్వమందు గానరావు. శైలి, సరళలలితమై తేటమాటలు, వాడుకపదములు, భావమథనము, రసపోషణము, నవ్యకవితాలక్షణములై పరగుచున్నవి.

నవీ నాంధ్రకవితా ప్రయత్నములందు పురాణేతిహాసగాథలేకాక, జగములోని సమస్తవిషయములను, కావ్యసామగ్రిగ నంగీకరించు వాడుక లేర్పడినవి. నానాదేశముల ప్రాచీనకవులు, మానవజీవితాంశములను, మానవరూపమున సంభావింపబడిన, దివ్యతత్త్వములను, కావ్యవిషయములుగ గైకొని యుత్తమగుణాంకితులగు నాయికానాయకులనే, కమనీయతన్వంగులనే వర్ణించుచుండిరి. ప్రాచీనకవులు మానవేతరమైన భూతప్రపంచమందలి రూప గాంభీర్య సౌందర్యముల ననుభవించి, కథాసందర్భమున జిత్రించిరి కాని ప్రకృతియందు స్వకీయజీవలక్షణములూ, కావ్యగౌరవము ఆపాదించియుండలేదు. వ్యాస వాల్మీకాది పౌరాణికులు, గిరి వన సారస నదీ సౌందర్యమును, యథారూపముగ వర్ణించియున్నారు. కాళిదాసమహాకవి తన లౌకిక పరిజ్ఞానము నుపమానములందు బొందుపరచెను తరువాతి ప్రబంధకవులు, ప్రకృతినుత్ప్రేక్షించి తమ భౌతికానుభవముల వెల్లడించిరి. ఒక్క భాగవతమందు తప్ప తక్కుడు ప్రాచీన కవిత్వములో నేమెడను మానవమానసముతో భౌతికప్రపంచము పెరలియాడెడి సాను

భూతిగాని, యుపేతుగాని విస్తరింపబడియుండ
లేదు. భాగవతములోకూడ నిది భూతమ
యుండగు వాసుదేవునియెడలనేచూపబడినది.

రూపోల్లేఖనమందు, చేష్టాభివర్ణనమం
దు, భావనిరూపణమందు, రసానుభవనిర్ణయ
మందు, మానససంచారవైఖరుల జిత్రించుట
యందు, ఆత్మానుభవముల వెల్లడించుటయం
దు, ప్రకృతిలోని శబ్దగుణాదులను అనుకరిం
చుటయందు, యథారూపముగ నివేదించుట,
స్వభావకవిత్వ మనబెల్లును. నిజముగ మను
ష్యుడు తన జ్ఞానేంద్రియము లుపయో
గించి, కొంత ప్రపంచమును చూచుచు
న్నాడు. మానసకోశసాధన ముప
యోగించి కొన్ని జగల్లక్షణముల బరికించు
చున్నాడు. తన విజ్ఞానకోశ ముపయోగించి,
స్థూలేంద్రియముల కందరానిలోతు లరయు
చున్నాడు. మానవుని యనుభవముబాహ్యేం
ద్రియ అంతరింద్రియములయొక్కయు, ఆత్మ
ప్రబోధములయొక్కయు, ప్రత్యక్షాను భవ
మున నేర్పడినదియే కాని, ప్రత్యక్షాతీతమైన
విషయమేదియు,విజ్ఞాన ప్రపంచమునగానరాదు
ఏదిచూచినను, యెద్దాని ననుభవించినను,
కావ్యకళాప్రపంచమం దెవ్విధి విస్తరించినను,
మనుష్యుని అనుభవములు, సంచారములు,
జగమును ప్రత్యక్షముగ ననుభవించి యథా
రూపముగ జిత్రించిన స్వభావచిత్రములేకాని
మనుష్యునకు స్వతంత్రభావన మెందునను
లేదు. మనుష్యుని అనుభవములనువిశుద్ధముగ
జెప్పినయెడల, నవియే కోశసాధనమున, నను
భూతమైనను, చిత్రసౌందర్యమొప్పని పేలవ
మున, గద్యసాధుత్వమున, నగుపడును. రాము
డుగ్రభీరుడు; భీముడుబలవంతుడు; అనంగుడతి
సుందరుడు అనిచెప్పటలో జగమంతా రామ
మయామని నిర్వచించుటలో కావ్య సౌందర్య
మేర్పడదు "సముద్రఇవ గాంభీర్యే", అని
గాంభీర్యగుణమందు ప్రత్యక్షముగ బేరొందిన,
రాముని సముద్రమును ఒక్క పర్యాయము
చింతించి చిత్రించుటవలన కావ్య మేర్పడు
చున్నది. చంద్రవదన, పంకజాక్షి "కాలకంఠ
కఠోరకంఠహుంకారంబు చెవుల సోకని నాటి
చిత్తభవుడు" అనునపుడును, కావ్యచిత్ర
మేర్పడుచున్నది. ఇందులో ప్రతి విషయము
ప్రత్యక్షస్వభావసందర్భమే. కాని యీప్ర
త్యక్షానుభవములను విడివిడిగా చెప్పక వస్తు
హేతుఫలాత్మకమైన సంబంధములనూహించి,
గుణరూపభావ సామ్యతల నూహించి, వివి
ధానుభవముల నొక్కచోగూర్చి నిర్వచించు
టవలననే, కావ్యచిత్రము లేర్పడుచున్నవి.
మరియు నొకవస్తువునందు, ప్రత్యక్షముగ నను
భవించిన గుణములను, మరియొకదానియం
దారోపించుటవలనను, అచ్చట నున్నవేమో
అని భ్రమపడుటవలనను, సామ్య విరోధము
లను గార్యకారణములను బరికించుటవలనను,
కావ్యాలంకారములు ఏర్పడుచున్నవి. ఇటు
లనే, స్థూలేంద్రియ, సూక్ష్మేంద్రియ మార్గ
ముల, మానవుడు తెలుసుకొను వివిధాను
భవములను, నిజముగ ప్రత్యక్షములై,స్వభావ
జాతీయతతో వర్ణింపవలసినవానిని, ఒకదాని
తో నొకటిపోల్చియు, విరోధమాపాదించియు
ఒకదానియం దొకదాని నూహించియు,మాన

వుడు వివిధరీతుల నగుపడు కావ్య చమత్కా రముల నేర్పరచియున్నాడు. అన్నమయ, మనోమయ, విజ్ఞానమయకోశములతో జూడ బడు, అనుభవింపబడు, ప్రపంచమునభివర్ణించు కావ్యకళారీతులు, గణితప్రకారముల నస్తరీతులమాత్రమే గ్రహింపగలవు. వీనిని అనుభవించురుచులుకూడ యేడుమాత్రమే. ప్రాణచోదితమైన చేష్టలుకూడ బరికించినచో 15 వైఖరు లగును.

అన్నము —రూపము— అ

ప్రాణము —చేష్ట— ఆ

మనస్సు —భావము— ఇ

విజ్ఞానము—దివ్యసూచనము— ఈ

ఇందులో ఒక్కొకటి 4 విధములు, జంటలుగా 6 విధములు, మూడేసికలిసి 4 రీతులు, నాలుగూకలిసి 1 టి వెరసి 15 వైఖరులుగ మానవుని జ్ఞానేంద్రియానుభూతమగు విజ్ఞానము, కావ్యచిత్రాదులందు వెలుంగగలదు. కాని అనుభవములో నివియన్నియు చేరియే వేరువేరుపాళ్లలో కలిసియే వచ్చుచు ననంతమగు కావ్యవైఖరులు, లెక్కలేనిరుగులు, యేర్పరుచుచున్నవి కలయికలో నివి పొందు ప్రాముఖ్యమునుపట్టి కావ్యచిత్రాదులు యథారూపములనియు, సాంకేతికములనియు, భావభరితములనియు, దివ్యజ్ఞానసూచకంబులనియు, చిత్రాలంకారశోభితములనియు, వేరువేరు పేరుల బ్రశంసింపబడుచున్నవే గాని లోతుగ విచారించినయెడల మనుష్యుని విజ్ఞానమందు ప్రత్యక్షముకాని దేదియులేదు. కవి, శిల్పకుల రచనలందు స్వభావనిర్దేశముతప్ప వేరేమియు లేదు. మనిషి ఏదివర్ణించినా, స్వభావోక్తియేకాని, స్వతంత్రకల్పనము వీని కమరియుండలేదు. ఇందుచే జగములోని కావ్యచిత్రశిల్పములన్నియు, వివిధసోపానములఅనుభవములను తెలుపు స్వభావచిత్రములనియే, అన్నియు నొక్కటే యని నిర్వచింప గలిగియున్నాను. కాని రూపచేష్టాభివర్ణనము, మానససంచారవైఖరులు, అలంకారముల అతుకుబాటు లేకుండ, విశుద్ధముగ శాస్త్రసారళ్యములో వర్ణించుపట్టులనే స్వభావకవిత్వమని చెప్పుచున్నాము.

తొల్లిటి తెలుగుకవిసింగములలో చేష్టాభివర్ణనమందు పోతరాజును, మానసవ్యాపారోల్లేఖనమందు తిక్కనసూరనాదులను స్వభావకవులని చెప్పవచ్చును. ముక్కుతిమ్మన "నానాసూనవితానవాసనల నానందించు సారంగ మేలాంన న్నొల్లదటంచు"అను పద్యములో సంపెంగపువ్వుయొక్క విరహావస్థను వర్ణించినాడేకాని యీ వర్ణనమంతయు సత్యభామ ముక్కుటందమును రూపించుట కుపయోగింపబడినది. పెద్దన సూర్యాస్తమయరాగముల జిత్రించుచు వరూధిని యాశాభంగమునకు వగచి "రోషభీషణ స్ఫురణ వహించెనో యన నభోమణి దాల్చె గషాయదీధితిన్" అని చెప్పియున్నాడు. ఇందువరూధిని విరహవేదనమే ప్రధానాంశముగాని, సూర్యాస్తమయపు వెలవెలపాటుపెద్దన కేవిధమైన భావోదయము కల్పింపలేదు.

"యాత్యేకతో స్తశిఖరం పతిరోషధీనాం
ఆవిష్కృతో౽రుణపురస్సరఏకతో౽ర్కః

తేజోద్వయస్య యుగపద్వ్య సనోదయా
భ్యాం"

అనుషట్టున కాళిదాసు చూపిన సానుభూతి పెద్దన వాక్యములందు లేదు.)

పురాణములందును ప్రబంధములందును విరివిగ ప్రత్యేక పద్యములలో, వర్ణింపబడిన ఋతువులు, గిరినదీవనారామ కాసారసౌంద ర్యము, శుకపికాదులు, కావ్యాంశ మగు, మానవ చరిత్రోల్లేఖనమునకు, వన్నె వెట్టెడి యుపాంగములుగ నవలంబింపబడినవే కాని, భౌతికవిషయములందు పూర్వకవు లెవ్విధ మైన కావ్యయోగ్యతను గణియింపరైరి. ఈ నాటి ఖండకావ్యము లల్లు నవీనాంధ్రకవులు ప్రకృతియొక్క రూపావస్థలకు మానవ చరి త్రముతో దులదూగుగౌరవమిచ్చుచున్నారు. మరియు నవీనకాలతత్వమగు మానస విజ్ఞాన వీథులలో నవేద్యతత్వజిజ్ఞాసలో తమ కావ్య రీతుల సంచరింపజేయుచున్నారు.

ఖండకావ్యములు, జాతీయ భావము, శాస్త్రవైఖరి గద్యసామీప్యత, కావ్యాలం కార సంప్రదాయముల ద్రోసిపుచ్చుట, భావ విమర్శనము, కల్పనయందు వృత్తములందు లక్షణమందు, కావ్యవిషయమందు క్రొత్త దారుల పరీక్షించువేడుక యీనాటి తెలుగు కవిత్వమునకు ముఖ్యాంగములై యున్నవి. తెలుగుబాస పూర్వకవులచేతిలో విపులమగు కావ్యసిద్ధినొందియున్నది. వీరికల్పన బాహుళ్య మురుచివంతమై ప్రస్తుత కావ్యయత్నముల వెలు గును గ్రమ్మివైచుచున్నది. పూర్వోన్నత్య మనుభవించిన కుటుంబములోగాని, జాతిలో గాని నవీనులు విశేషవిఖ్యాతి నొందనేరరు. పూర్వుల ప్రతిష్ఠ వీరియత్నములకు ఒకప్రక్క దోడ్పడుచు, మరియొకవంక దుస్తరమగు సం ప్రదాయనిబంధనము లేర్పరుచును. వారు, తామందుకొనిన విషయముల కుపయోగించెడి పరిభాషయు, కల్పనములు యేర్పరచియున్నా రు. ఇప్పుడు కాలోచితముగ కావ్యవిషయ ము భిన్నమైనది. ఇందు కనుకూలమైన భా షను, పూర్వకవుల దివిటీవెలుగుముందర నవీ నాంధ్రకవులు స్వతంత్రించి కల్పింపజాలక, యుక్కిరిబిక్కిరి అగుచున్నారు. చూచువా రికి నేటి తెలుగుకవిత్వము విచ్చలవిడియై, హద్దులుమీరి, చెలరేగుచు నంతులేని ప్రయో గపరీక్షావేదనమున దెప్పరిల్లిన ట్లగుపడుచు న్నది. కాని యోపికతో విచారించిచూచిన తెలుగుదేశము కావ్య, సంగీత, నాటక, చిత్ర కళలందు విపరీతమగు ప్రసవావేదనమందుచు బలు మొగంబుల వికసించుచున్న వాస్తవ మగుపడును.

ఆంధ్రుల ప్రత్యేకజాతీయ లక్షణము సాం ఘికవిషయములలో స్వల్పవిద్యాధన ధీశక్తు లొాదవిన పలువురు యేకముఖమున యత్నించి మహాకార్యములను నెరవేర్చునదై యున్నది. ఈదేశపు మత సాంఘిక రాజకీయ ఆర్థిక చరి త్రానుభవములబట్టి యిచ్చట మహామహులై లోకములోని బలవిద్యాధనప్రజ్ఞా బాహుళ్య మును ఒక్కతావున నిలుపగల విపరీత పురు షు లుత్పన్నముగానేరరు. కాని దేశము సమస్త విషయములలో పలువురికేలూతనొంది కార్య సిద్ధిలో నేరికిని జంకని రీతి వికసించు చున్నది.

ఇక్కడ మహాకవి, మహాద్రష్ట మహాత్ముడు ఒక్కడుగ బయలిడకపోవచ్చును. కాని నేడు తెలుగుకైతల బెంపొందించుచున్న రెండు వందల బాలకవులు తలకొక యలంకారమును సమర్పించి యాంధ్రభారతిస్వరూపమును నిండు పొలుపుననవ్యసౌందర్యమహిమతో జెన్నొంద శిల్పించియున్నారు. ఆంధ్రగీతికలు స్వరాజ్య సౌభాగ్యములను, స్వారాజ్య భోగములను బొంద మిన్నుమన్నుల జిందులాడు చున్నవి. యూరపుదేశములు రెండు శతాబ్దములలో పొందినకావ్యసిద్ధి వంగీయ కవిశేఖరులు కాళీ ఘట్టవిపులైశ్వర్య సహాయమున దిశాంతముల వెలిగింప జేసిన కావ్యసిద్ధి, పేరుపెంపులరయని తెలుగుసీమల పిల్లకవులు పదియేండ్లలోనందికొని, తెలుగు పలుకుల తేటతీపిలో నూరించుచున్నారు. ఆంధ్రుల కావ్యసిద్ధిలో సిగ్గొందవలసినవిషయ మెద్దియు, తలవంచవలసిన వెనుకపాటేదియు లేదు. అభిమానించి, పెద్దజేసి, యన్యభాషల సంతరించి, నాగరకప్రపంచమున నాంధ్రుల కావ్యసిద్ధి నెరజల్లు దేశాభిమానులే కొఱ వగుచున్నారు. కాని, యాంధ్రభారతిమాత్ర మాధునిక ప్రాచీనభూషణాంబరముల నిండు పొలుపుతో శోభిల్లుచునేయున్నది.

మఱియు, కావ్యశిల్పాదులందు ఆంధ్రుల ప్రత్యేకలక్షణము, వీరి కావ్యములను చిత్రశిల్పములను, తక్కుడు భారతీయ కళారూపములతో బోల్చిచూచిన స్పష్టమగును. వ్యాసుని భారతమును కవిత్రయపు తెలుగుదానితో—శుకుని భాగవతమును, పోతనకృతముతో—కుమారసంభవమును, హరవిలాసముతో—సంస్కృతకావ్యములను పెద్దనాదులయల్లికలతో—హైందవ శిల్పాలంకారములను అమరావతి, తాటపత్రిలోని చెక్కడు పనులతో పోల్చిచూచినయెడల, కళలందు తెలుగువారి నైజప్రతిభ గోచరింపగలదు. వీరు విపులమగు విశాలమగు, పరిమాణగాంభీర్యము లొప్పు కల్పనలజేయరు. కొద్దిపరిమితిలో చిత్రలక్షణ మెక్కువ దీపించునట్లు రస భావాలంకారములు, నాట్యవైఖరులు అందముగ నగుపడునట్లు రచించుచుందురు. ఈ కళారహస్యమును తెలుగుసీమయందొక వెడి నిదర్శనములన్నియు స్థిరపరచుచున్నది. కొద్దిపరిమితిలో విశేషమగు నలంకారముల గూర్చి మిక్కిలి యందముగను, రసవంతముగను రచించుటయే ఆంధ్రుల నిజస్వభావము. తెలుగుబాస నైజమాధుర్యము భక్తి శృంగార రసములలో వెలుగొందుచుండును. ఇతర రసముల బోషింపవలసివచ్చినపు డన్యభాషాపదముల బ్రయోగింపకతీరదు. నేటి తెలుగు కవిత్వమో కల్పనలందును, వృత్తములందును స్వతంత్రసంచార మొనర్చుచున్నదే కాని, పదజాలమును పెంచుకొనుయత్నము లంతగా జేయకున్నది.

తిరుపతి వెంకటకవు లాధునికాంధ్ర కావ్యవాటికాపాలకులై. తేటైన తెలుగుదారులవిప్పి చూప—రాయప్రోలు సుబ్బారాయని లలితాంధ్రపద ప్రయోగ మనివార్యభావ విస్తారమున జెలువొంద—గురజాడ అప్పారావు తెలుగునిగ్గులదేలు గోరంకికూతలసారువిహార—

మంగిపూడి వేంకటశర్మ జంతుజాలముతో సరససల్లాపములాడి లేతతలపుల పల్లవింప— లక్ష్మీకాంతము, సత్యనారాయణ, రామిరెడ్డి, వెంకటపార్వతీశ్వరులు, సాహితీసమితి మున్నగు బాలకవు లెందరో వైష్ణవనాయికాలాపముల సుకుమారగీతికాంజలు లర్పింప— తెలుగుకైతల కొత్తపోకడలు, రాజమహేంద్రపురోహితుని కావ్యసామ్రాజ్యమును, చరిత్రాంశముగ రూపుమాపి, కావ్యాలంకారశృంఖలావిచ్ఛేదన మొనర్చి, తేటైన గీతమాలికలతో, తియ్యని తెలుగుపలుకులతో, కమ్మని యాలపోకడలతో, చురుకులీనెడి క్రొత్తరూపులతో షడ్రసస్ఫూర్తితో, నవరసాలంకృతమై జగదాదరణీయసుందరాకారమున వెలుగొందుచున్నవి.

ఆరుద్రపురుగు

భండారు వీరరాజేశ్వరరావు గారు, బి. ఏ.

చలిత నిదాఘ రాక్షస నిశాత ప్రచండిమ మోర్వలేక మూ
ర్ఛిలియును, ప్రావృడంబుదశరీరు జయంజయ దుందుభిస్వనం
బులు చెవిదూఱ, పుల్కలు గుబుల్కొన మేల్కొను భూకుమారిక౯
దలకొన జేయు నీ బయలునం గల పచ్చికమోకజొంపముల్.

ఉ. ఈ నెఱసంజకెందళుకు లీ ధరణీమణి బాసిపోవ నెం
తేని గృశించి, తమ్ము స్మరియించెడు చిన్నె లొసంగి మిత్ర స
న్మానము జేయనెంచి, సుకుమార తృణార్ద్ర దుకూలశయ్యల౯
గూనుక జేసిపోయె ననుగుంబసిబిడ్డల నార్ద్రపుర్వులన్.

చ. కడుపునగన్నవారు మమకారము నావలద్రోసి యేగి రం
చడలక, నూత్న బాంధవగృహాంగణసీమ వసింప నివ్వెఱం

బడకయు, పట్టుపూఁబఱుపుపై సుఖనిద్ర మునుంగుచున్న దీ
బుడుత, తదీయ ప్రేమపరిపూరిత నిర్మలభావ మెట్టిదో!!

గీ. తత చరాచరభూతసంతతులనెల్ల, అమల సౌహార్ద్రభావరసార్ద్రములయి
అనుపమానంద సుఖ మనోహరములైన, శైశవప్రాయదశలు పూజ్యములుగావె!!!

గీ. ఎడనెడఁ గన్నవారింటి గొడవలేవొ, కలలఁగనుచుంట నీ పురుగులవలంతి
చిన్ని నునుమేను కదలించుచున్నదిద్ది, ఎంత ప్రేమార్ద్రసుకుమారహృదయయహహా!!!

* * * * * *

గీ. ఈ ప్రభాతారుణాదిత్యహేమపాద,రజము నునుమేనుపై వింతరంగు లీన
కన్నులరవిప్పి, తన చిన్ని కాళ్ల విచ్చి, ప్రాకులాడెడు నెటకొ యీ పడుచుపురుగు!!

సీ. తనబాట నావరించిన చిన్నసలుసు లా,వలకు ముంగాళ్ల ద్రోపాడుకొనుచు
బలవత్తరాటంకములు గల్గునెడ పూర్వ,మార్గ మింకొకత్రోవ మార్చుకొనుచు
పగవేగులకు కనంబడకుండునటు దారి, నడుగుజాడలను రూపడచుకొనుచు
ఆప్రదేశనివాసు లగువారి భావదృ,ష్టులనెల్ల తనవైపు మలపుకొనుచు

గీ. యెదియొ గమ్యప్రదేశమాతృకనుజేర, నాయతంపడు పటురాజకీయవేత్త
యటుల నడచుచునున్న దీయార్ద్రపురుగు, సృష్టిలోనేస్థలం బాక్రమించుకొనునొ,!!

ఉ. ఆయెడ తెల్విమాలిన యొయారి యొకర్తుక, చిట్టిబొట్టునో
మీఁయగనేగుచుఁ గెలన నీపురుగుఁ గని, దానిబట్టి, కెం
జాయల మేన్మి కుంకుమపుసారము మంజిమ మొల్కునట్లుగఁ
జేయదలంచి, కూర్మి బరణిఁ బడవైచుకపోయె నక్కటా!!

గీ. సకలసృష్టి ప్రధానవిజ్ఞానియైన, నరుడు, నతిసూక్ష్మమగు నార్ద్రపురుగుకరణి
తన భవిష్యద్విశేషంబులను గ్రహించ,లేక యెప్పటికపుడు త్రుళ్లిపడుగాదె?

గీ. ఆ కటుకుఁజేయి తనమేన సోకినంత, చికిలిపగడంబువలె ముడించికొనెపురుగు;
ప్రకృతి చైతన్య సహజలావణ్యములను, పాడుచేయుట మనుజస్వభావమేమొ!!

గ్రామపునర్నిర్మాణ సాధనములు

ఆర్. కృష్ణశాస్త్రిగారు, బి. ఎ. (ఆనర్సు)

ప్రకృతము మన దేశమం దెల్లెడలను గ్రామపునర్నిర్మాణసన్నాహములు సలుపబడుచున్నవి. కీర్తిశేషులైన దేశబంధు చిత్తరంజనదాసుదారి అఖిలభారత జ్ఞాపకచిహ్ననిధి యీ యుద్యమమునకై వినియోగింపబడునని మహాత్మగాంధిగారును, తదితర ప్రముఖులును తెలిపియున్నారు. ఇదియును గాక, స్వతంత్ర సామ్రాజ్యపదవి నలంకరించియుండు ప్రతిదేశమును ప్రజాసామాన్య నివాసములగు గ్రామపునరోద్ధారణ ప్రయత్నములు జరుపుచున్నది. ఇట్టి తరుణమున మనమూరకుండుట పాడిగాదు. ఈ యుద్దేశము లనతి కాలమున ఫలింపవలెనన్న మన దేశవాసుల జ్ఞానాభివృద్ధి ముఖ్యముగ అత్యావశ్యకమని చెప్పుట కేలాటిసందియమును లేదు.

ప్రకృతము మన కర్తవ్య మేమన:— ప్రస్తుతపు పాఠశాలలను మూడు తరగతులుగా భాగింపవచ్చును. (1) ప్రజలచే నడుపబడు ప్రైవేటు పాఠశాలలు. (2) గవర్నమెంటువారిచే గ్రాంటుపొందుచు, పోషింపబడునవి. (3) గవర్నమెంటువారిచే స్థాపింపబడిన పాఠశాలలు. ఇప్పటికున్న యీ పాఠశాలలను పోషించి నశింపకుండునట్లు జేయుటయు, నూతనపాఠశాలల స్థాపించుటయు మనవిధియై యున్నది. మన మెల్లపుడు ప్రభుత్వమువారిపై నాధారపడియుంటిమేని మన మేకార్యమును జేయజాలము. పరులసహాయముకన్న స్వయంకృషియే శ్రేష్టము. ఒకగ్రామమున మనమొక క్రొత్తబడి పెట్టవలయునన్న స్థానికులైన భాగ్యవంతులు కొందరుచేరి కొంత చందాను పోగుచేసి యొక పుపాధ్యాయుని నియమించి, అతని జీవనము జరిపెదమని వాగ్దత్తమిచ్చిన కార్యము సులభముగ కొనసాగును. బీదసాదల పిల్లలను అటుతర్వాత చేర్చుకొనవచ్చును. ద్రవ్యమివ్వలేనివారు ధాన్యరూపముగ తమ చందాను పంటకాలమునం దియ్యవచ్చును.

ప్రస్తుతము ఏయుద్యోగమును దొరకక, ఎట్టి జీవనోపాయమును లేనివారే విద్యాశాఖ నాశ్రయించుచున్నారు. ఉపాధ్యాయుల కిచ్చు వేతనము బహుస్వల్పమగుటచే తగినమేధావులా వృత్తి నవలంబింప కున్నారు. పాఠశాలల స్థితి మన దేశమున నిట్లుండుట కడు శోచనీయము ఉపాధ్యాయులకు తగిన జీతమిచ్చు శక్తి గలుగువరకు వారిని యితరవృత్తిచేదైన నొక దాని నవలంబింప అనుమతి యొసగిన యీకష్టము కొంతవరకు నివారించుటకు సాధ్యమగును. గవర్నమెంటువారుకూడ యీవిషయము నాలోచించికాబోలు అనేకచోట్ల యుపాధ్యాయులను బ్రాంచిపోస్టుమాస్టర్లుగా నియమించియున్నారు. అదేరీతిగ మనముకూడ కొన్ని

-చోట్ల పగటిపూట నితర వృత్తి నేదైన కలిగి యుండినవారిని రాత్రియందు విద్యగరపుటకు నియోగింపవచ్చును. అయితేయుపాధ్యాయులు యీరీతిగ జీవనోపాయమునకును సహాయ భూతములగు నితరవృత్తుల నవలంభించినవిద్య చక్కగా బాలురకు బోధించుట కాటంకము కలుగునని కొందరు సందేహింపవచ్చును. కాని గవర్నమెంటువారు ఉపాధ్యాయులు తపాలా ఫీసుపని చూచుచున్నందువలన విద్యాశాఖకు యేలాటిలోపమును కలుగలేదని(Vide Quenquennial Report on Indian Education (1907.12.) ప్రచురించి యున్నారు. ఎట్లైనను యిట్టి ఏర్పాటులు తాత్కాలికములుగా భావించి సాధ్యమైనంతత్వరలోఉపాధ్యాయుల శక్తినంతయు విద్యావిషయముబందే ప్రయోగింపజేయుటకై వారికి తగిన వేతనము లిచ్చి జీవనోపాయము కల్పింప ప్రయత్నింపవలెను. కేవల ధనార్జనాప్రీతిగలవారు యీ వృత్తికి తగరు.

ఇట్టి పాఠశాలలను పెట్టుటకై సుందర భవనములకై వేచియుండ నవసరము లేదు. దాదాపుగ ప్రతిగ్రామము నందును, దేవాలయము లుండును. పాఠశాలలనట్టిఆలయము లందో, లేక గ్రామచావడియందో, లేక ధర్మ సత్రమందో కొంతకాలము పెట్టవచ్చును. తరువాత గ్రామస్థులందరేకీభవించిన నొక కొట్టము నతిశీఘ్రకాలములో నిర్మింపవచ్చును. భాగ్యవంతులు స్థలముచితముగ, మరికొందరు తమకష్టమును యుచితముగ నొసగవచ్చును. క్రమేణ విద్యాశాఖవారికి వ్రాసి గ్రాంటు తెప్పించుకొని పాఠశాలల నభివృద్ధిపరుప సదుపాయముల కావింపవచ్చును. ఇదియును గాక ఇంగ్లాండు మొదలగు పాశ్చాత్య దేశములందు విద్యాశాఖాధికారులు బహిరంగ పాఠశాలలు (Open-air Schools) స్థాపించుటవలన విద్యార్థుల దేహదారుఢ్య మభివృద్ధి పొందునని బోధించుచున్నారు. ఇట్టి పాఠశాలలు హిందూదేశమునకు నూతనములుకావు పూర్వకాలమున మహర్షులు తమశిష్యులకు (శోభారమణీయమై ప్రకృతికి నిలయములగు) తమఆశ్రమములందు విద్యగరపెడివారు. కాబట్టి భవనముల కొరకు ద్రవ్యములేదని మనముచింతింప నవసరములేదు.

ప్రస్తుతము పాఠశాలలందు గణితము, చదువుట, వ్రాయుట, ముఖ్యముగా బోధింపబడుచున్నవి. ఇవిగాక యింకను బోధింపవలసినవిషయములు పెక్కులున్నవి. మనదేశ మితరదేశములవలె నభివృద్ధి పొందవలెనన్న ఆర్థిక విషయములును, (Economics) రాజ్యాంగపద్ధతులును (Civics) నైతిక సాంప్రదాయములును, మనదేశ చరిత్రయు తప్పక బోధింపవలసి యున్నది. ప్రతిపాఠశాలయువృత్తిసంబంధమగువిద్య (Vocitional training) కూడ గరపుచుండవలెను. ఇట్లు గావించిన యెడల ప్రతివిద్యార్థియు తనపాఠశాలను విడచినవెంటనే తన జీవనోపాయమునకైయెక్కువ కష్టపడవలసిన అవసరముండదు. ప్రతి పాఠశాలయందును బాలభట సంఘ(Boy Scout Association) మొకటి యుండవలెను. అట్టి సంఘములు విద్యార్థులయందు మతవర్ణ భేద

ములు లేక ఐకమత్యత పెంపొందించుచు పరోపకారబుద్ధినికల్పించి దేశసేవచేయ పురికొల్పుచుండును.

పాఠశాలలు స్థాపింపవచ్చునుగాని వానిని పోషించి, కొనసాగించుట అంత సులభమైన కార్యముగాదు. ఆరంభ శూరత్వమువలన ప్రయోజనములేదు. గ్రామస్థులందరు పాఠశాల తమదని భావించి దాని యభివృద్ధికై సదా పాటుబడుచుండవలెను. విద్యాశాఖాధికారులు సంవత్సరమున కొకతూరియో రెండు మారులో తనిఖీకివచ్చుచుందురు అట్టి వారికి నిజస్థితి తెలిసికొనుట కెట్లు సాధ్యమగును? కాబట్టి ప్రతిగ్రామమునందును, గ్రామస్థు లీ విషయమును పరిశీలించి పాఠశాలాసంఘము (School Committee) నొకదానిని నేర్పరుచుకొనవలెను. ఈ కమిటీవా రప్పుడప్పుడు బడిని తనిఖీచేయుచుండవలెను. ఇట్లు చేయుట వలన యుపాధ్యాయులు తమపనియందు అశ్రద్ధగానుండుట కవకాశముండదు. మరియుయీ కమిటీవారు పాఠశాలకు పోదగిన బాల బాలికల తల్లిదండ్రులను ప్రోత్సాహపరిచి తమపిల్లలు పాఠశాలలందు చేరునట్లుగ చేయవలెను. చేరినపిల్లలను ప్రతిదినము పాఠశాలకు పంపునట్లు చేయవలెను. ఇట్లు గ్రామస్థులెల్ల రేకీభవించి యుపాధ్యాయులకు తోడ్పడినగాని యీ కార్యము కొనసాగదు. పాఠశాల లోపాలోపములు విద్యాశాఖాధికారులకు గాని లేక తాలూకా డిస్ట్రిక్టుబోర్డులకుగాని లేక గ్రామస్థులకుగాని తెలిపి నివారించుటయందు యీ కమిటీవారు తోడ్పడవలెను. పాఠశాలలపోషించి యభివృద్ధిపరచుటకు చందాను యీ కమిటీవారు సమకూర్చవలెను. కొన్ని గ్రామములందు కేవలము గ్రాంటుసంపాదించుటకుమాత్రము బడులు యేర్పడినట్లు తెలియుచున్నది. ఈరీతి ప్రజలను మోసముచేయుటకు గ్రామస్థు లవకాశమియ్యకూడదు. అయినను యాకమిటీవారు రంధ్రాన్వేషులై యుపాధ్యాయులపై లేనిపోని నేరము లారోపించి విద్యాభంగము కలిగింపక జాగరూకతతో మెలగవలెను. విద్యాధికారులు, యుపాధ్యాయులు, బాలురు, గ్రామస్థులు, వీ రొండొరులకు సహాయభూతులుగానుండి మెలగినగాని గ్రామవిద్యాభివృద్ధి పొసగదు.

ఇక పెద్దవారికి విద్యగరపుసాధనముల గూర్చి విచారింతము. విద్య నేత్రేంద్రియ మూలముననేగాక శ్రవణేంద్రియముల సహాయమునకూడ నభ్యసింపవచ్చును. అనగా చదువుటకు వ్రాయుటకు తెలియకపోయినను జ్ఞానము వినికిడివలన సంపాదింపవచ్చును. సామాన్యజనులకు భారత రామాయణాది యుత్కృష్టగ్రంథములు హరికథారూపమున భాగవతులవలన బోధింపబడుచుండుట మన కందఱకు తెలిసినవిషయమే. పురాణములు సర్వసాధారణముగ నొకరు చదువుచుండిన అనేకులు గుంపులుగూడి కుగ్రామములందు వినుచుండుట మన మెన్నియోసారులు చూచియుందుము. ఇదియునుగాక భజనమందిరములందు భక్తిరసయుక్తములగు కీర్తనలు పాడుటవలన శ్రవణానందము కలుగుటయే గాక జ్ఞానాభివృద్ధికూడ కలుగుననుట యతిశయో

క్తికాదు. ఈరీతిగ బడికిపోవ సౌఖ్యముకాని ప్రతియొక్కరు జ్ఞానమును గడింపవచ్చును పఠనమందిరముల స్థాపించి విద్యావంతులైన వారు "ఆంధ్రపత్రిక" యిత్యాది వార్తాపత్రికలనుండి ప్రాపంచికవిషయముల రాత్రులందు రైతులకు బోధించి మన దేశమున గల అజ్ఞానమును బాపవచ్చును.

పఠనమందిరములగూర్చి యిదివరకు కొంత చెప్పబడియున్నది. అట్టి పఠనమందిరములలో పుస్తకభాండాగారములుకూడ స్థాపించుట యుత్తమము. ఆంధ్రదేశమున యీ గ్రంథాలయోద్యమము ప్రబలుచుండుట శుభసూచకము. ప్రతిగ్రామమునందును గ్రంథాలయ మొకటి యుండవలెను. వీని యుపయోగములగూర్చి విశేషించి వ్రాయనక్కరలేదు. కాని ముఖ్యముగ ప్రారంభపరీక్షయందు కృతార్థులై పట్టపరీక్షకు చదువ నశక్తులైనవార లనతికాలమున వారుగడించిన విద్యను మరచి పోవుచుందురు. అట్టివారికి యీ గ్రంథాలయములు విరామమునప్పుడెల్ల తమవిద్య నభివృద్ధిపరుప వురికొల్పుచుండును. ఇదిగాక విద్యావంతులైనవారు యీ పుస్తకభాండాగారములం దప్పుడప్పుడు సమావేశమై ప్రాపంచికవ్యవహారముల చర్చించుచు, యుత్కృష్ట గ్రంథముల సారస్యము నితరులకు తెలియ చెప్పుచు తమ జ్ఞానమును వెదజల్ల నవకాశమిచ్చుచుండును.

కావున దేశోద్ధారకులెల్లరు యీవిద్యా ప్రచారోద్యమమునకు తోడ్పడి, యున్నపాఠశాలలను జక్కబరచి, లేనిచోట్ల నూతనముగ స్థాపించి ప్రజలకు జ్ఞానోపదేశమును గావించి శాశ్వతకీర్తిని బడయ ప్రయత్నింతురుగాక!

Printed at the 'Andhra Patrika' Press, No. 7, Thambu Chetty Street, G. T. Madras

అమృతాంజనము

అన్ని నొప్పులకు పరమామృతము



చక్కని డబ్బీతో సహా సీసా 1-కి అణాలు 10 మాత్రమే

అమృతాంజనం డిపో

బొంబాయి లేక మదరాసు

THE ANDHRA HERALD

(*Organ of the Andhra Students Union*)

President.

The Hon. Mr. V. RAMADOSS, A. S. U.

Vice-Presidents.

Diwan Bahadur S. GURUSWAMY CHETTI GARU, B.A., B.L.

M.R.Ry. P. KAMESWARA ROW GARU, M.A., M.L.

,, M. VENKATARANGAYYA GARU, M.A.

,, P. SUBRAHMANYAM GARU, B.A., L.T.

Magazine Committee.

G. V. RAGHAVAYYA, B.A., *Editor*.

S. V. SURYANARAYANA, B.A, *Manager*.

Members.

TATA KRISTNAMURTHY (*Hons. Class*).

Miss B. VENKATARATNAM, M.A.

S. RANGA ROW, *III Year Class*.

P. V. NARASIMHA ROW B.A.

T. NARAYANA ROW (*Hons. Class*).

M. V. SESHAGIRI ROW, B.A.

D. GOVINDA REDDI, IV M.B. *Class*.

V. SATYANARAYANA, B.A.

Printed by Thompson & Co, Madras.